# సింగిల్ పేజీ కథలు

## పరుగు పందెం

దాదాపు ఒక రోజు ముందుగానే హైదరాబాద్ చేరుకున్నాను. పెళ్లి మరో పద్దెనిమిది గంటల్లో. చంద్రం మా కోసం ఏర్పాట్లు ఘనంగానే చేశాడు. కళ్యాణమంటపానికి దగ్గరలోనే కావేరి లాడ్జిలో గదులు బుక్ చేసి ఉంచాడు.

అప్పటికే వేర్వేరు ప్రాంతాల నుండి అరడజను మంది దాకా మిత్రులు వచ్చి ఉన్నారు. చాలా కాలం తర్వాత కలవడం వలన మా అందరి మనసులలో ఓ రకమైన ఉద్విగ్నత... స్వీట్ నథింగ్స్‌కో, హాట్ సమ్‌థింగ్స్‌కో చెప్పుకోవడానికి మిత్రుడి పెళ్లికి మించిన సమయం, సందర్భం వేరే ఎక్కడ దొరుకుతాయి.

ఎన్ని జోకులు, ఎన్ని గాలికబుర్లు, ఎన్ని నవ్వుల హరివిల్లులు. ఎన్నాళ్లకి మా మనసులపై కురుస్తున్న ఆహ్లాదపు జల్లులు.

ఆనాటి అల్లరి చేష్టలు, ఆకతాయి పనులు, అమ్మాయిల విషయాలు, స్కూల్లో ఆగడాలు, వీధిలో జగడాలు, ఇళ్లల్లో వీపువిమానం మోతలు..అబ్బో.. గతంలోకి తొంగి చూస్తే ఎన్ని మధురానుభూతులు.

పనిలో పనిగా మరికొన్ని గంటల్లో స్వేచ్ఛ పోగొట్టుకుంటున్న చంద్రంగాడిపై కురిపిస్తున్న సానుభూతులు... ఉత్తుత్తినే ఉడుక్కుమొత్తనం నటిస్తూ, మళ్లీ వస్తానని అక్కడి నుండి జారుకున్నాడు వాడు.

మా కేరింతలు కొనసాగుతూనే ఉన్నాయి. నాకైతే నిన్నటి స్వర్గం మళ్లీ ఎదురైనంత సంబరంగా ఉంది మిత్రుల సందడికి.

నిజానికి చంద్రానికి చాలా ఋణపడి ఉండాలి. కాలానికి చెల్లాచెదురై మేము ఎవరికి వారై విడిపోయినా, దండలో దారంలా అందరితో టచ్‌లో ఉంటున్నది వాడొక్కడే. కాబట్టి వాడి పెళ్లిలో మాగ్జిమమ్ స్నేహితుల్ని కలుసుకోవచ్చు. అనుకుంటున్నట్టే మరో నాలుగైదు గంటల్లో దాదాపు అందరూ దిగిపోయారు.

ఇప్పుడు మేము మగపెళ్లివారం. అందునా పెళ్లికొడుక్కి ప్రాణ స్నేహితులం. మాలో ఏదో తెలీని విజయ గర్వం.

సరదాగా ఆడపెళ్లివారిని ఆట పట్టించడంలో కొత్త మార్గాలు వెదుకుతూ హడావుడి సృష్టిస్తున్నాం.


అంతా ఆనందమయం.

సరిగ్గా అప్పుడే అందిన వార్త మమ్మల్ని స్థాణువుల్ని చేసింది. మనసులు మొద్దుబారిపోయాయి. నరాల్లో శక్తి క్షీణించిపోయింది.

చంద్రానికి ఏడుపొక్కటే తక్కువ. అటు.. దగ్గర పడుతున్న ముహూర్తం. ఇటు.. నిలువనీయని షాకింగ్ న్యూస్.

నేనే ముందుగా రియాక్టయ్యాను. సాయానికి నలుగురు స్నేహితుల్ని ఉంచి, చంద్రానికి ధైర్యం చెప్పి, మిగతావారితో బయల్దేరాను.

దారి పొడవునా ఆలోచనలే శివప్రసాద్ గురించి. మా బ్యాచ్‌లో బాగా ఉన్నత చదువు అభ్యసించి, ఏదో పెద్ద సంస్థలో, గొప్ప ఉద్యోగంలో సెటిలయింది వాడొక్కడే. నిజానికి ఈరోజు వాడు చేరుకున్న స్థానం ముందు, మేమెవ్వరం వాడి కంటికి ఆనకపోయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. లోకం తీరే అంత గదా.




ఉండేది ఊళ్లోనే గాబట్టి, ఎలాగైనా పెళ్లి సమయానికి తప్పక వీలు చేసుకుని వస్తాడనే మేమందరం అనుకున్నాం.

కానీ... చివరి క్షణాల్లో ఇలా మేమే వాడి దగ్గరికి బయల్దేరాల్సి రావడం బాధాకరం.

ఇంటర్మీడియట్ వరకు శివప్రసాద్, నేను కలిసే చదువుకున్నాం. ఆ తర్వాత వాళ్లు హైదరాబాద్ షిఫ్ట్ అయిపోయారు. నేను మా ఊళ్లోనే డిగ్రీ చేసి, గంతకు తగ్గ బొంతలాంటి ఉద్యోగంలో సెటిల్ అయిపోయాను.

వాడి తల్లిదండ్రులు నాకు బాగా తెలుసు. పరీక్షల్లో కంబైండ్ స్టడీస్ టైములో మా ఇద్దర్నీ కూడబెట్టి చదివించిన మరో అమ్మ అతడి తల్లి. ఇద్దరిలో నాకు ఎక్కువ మార్కులు వచ్చినా మనస్ఫూర్తిగా అభినందించగలిగే ఉత్తమ సంస్కారం ఆ తండ్రిది.

వారికి కలిగిన కష్టాన్ని తలచుకుంటే గుండె పిండేసినట్లవుతోంది. అసలిది నిజమేనా. ఇంత చిన్నవయసులో శివప్రసాద్‌కి స్ట్రోక్ వచ్చిందంటే ఎలా నమ్మడం. ఇరవై ఏడేళ్లకి గుండె పోటా.

ఐ.సి.సి.యు బైట జీవచ్ఛవాలుగా ఉన్న అతడి తల్లిదండ్రుల్ని చూస్తుంటే నాకు దుఃఖం ఆగలేదు. కండిషన్ సీరియస్‌గానే ఉందిట. గ్యారంటీ ఇవ్వలేమని డాక్టర్లు పెదవి విరిచేశారట.

ఎలా..ఎలా జరిగింది.. ఎందువల్ల జరిగింది.

కారణాలు విశ్లేషిస్తుంటే, వాటిలో కొత్తదనాల కన్నా కొత్త పోకడలు ఆవిష్కృతమైనాయి.

పట్నం వచ్చాక ఫాస్ట్ జీవితానికి, ఫాస్ట్‌ఫుడ్ జీవితానికి బాగా అలవాటు పడిపోయాడు శివప్రసాద్. మధ్యతరగతి వాడిగా ధనిక వర్గాల గొప్పతనాన్ని వంటబట్టించుకున్నాడు. ఉన్నతస్థాయి నందుకోవాలని ఉవ్విళ్లూరాడు. లక్కీగా చదువు పూర్తవుతూనే మంచి ఉద్యోగం కూడా వచ్చింది. అతి తక్కువ సమయంలోనే విలాసవంతమైన జీవితానికి అర్రులు చాచాడు. పూర్వపు రోజుల్లో రిటైర్‌మెంట్ నాటికి ఓ సొంత ఇల్లు, సొంత వాహనం సమకూర్చుకోవడం గొప్ప. అలాంటిది ఉద్యోగంలో చేరిన ఐదేళ్లలోనే పాతిక లక్షలతో ఇల్లు, మరో ఆరు లక్షలతో కారుకి అధిపతి అయ్యాడు. దేశాన్ని మహమ్మారిలా క్రమ్మేస్తున్న ఆర్థిక సరళీకరణల వలలో చిక్కి, భోగాల మాయలో గిలగిలలాడిపోయాడు. తనకు లేని ప్రతిదానినీ పొందాలనుకున్నాడు. ప్రతి ప్రాసెస్‌కి ఓ కాల నియమం ఉంటుందని మరచి, పోటీ తత్వంతో, తన శక్తికి మించి పోరాటం ప్రారంభించాడు.

ప్రతిఫలంగా..

తన జీవితంలో సిగరెట్లు, మందు, స్థూలకాయం, రక్తపోటు, చిరాకు, అసహనం..

ఉద్యోగంలో ఒత్తిడి, శ్రమ, అలసట, పరాజయాలు, పరాభవాలు, భయం, చిట్లుతున్న రక్తనాళాలు.

కోరికలు గుర్రాలై మనిషిపైనే స్వారీ చేశాయి.

మనిషి కుప్పకూలిపోయాడు.

తిరిగి లేచినా బలహీనపడ్డ జీవయంత్రం మళ్లీ మునుపటి శక్తిని పుంజుకోగలదా?

సాధించాలనే తపన లేకపోతే మానవజాతి పురోగమించదు. ఆ తృష్ణకు వివేకాన్ని జోడించకపోతే మాత్రం పతనం వెంటాడక మానదు.

శివప్రసాద్‌కేమీ కాదని, తొందరగానే స్వస్థుడై ఇంటికి తిరిగి వస్తాడని ఆ తల్లిదండ్రులకి ధైర్యం చెప్పాను. నా మాటలు కేవలం ఓదార్పు మాత్రమే. జీవితాన్ని కాల్చుకున్న శివప్రసాద్ మళ్లీ తన సంకల్పబలంతోనే ఆ సంకట స్థితి నుండి బైటపడాలి.

-సి.వి.నరసింహదాసు (కోల్‌కతా)